ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల
జిల్లా వార్తలు
5
శనివారం 8 జూన్ 2024



మోడల్ కళాశాలలో ఇంటర్ విద్యార్థుల జాబితా విడుదల

కాసిపేట, జూన్ 7: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరానికి దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారి జాబితాను శుక్రవారం విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ అందె నాగమల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్ ఆధారంగా ఎంపిక చేసిన జాబితాను నోటీసు బోర్డుపై ప్రదర్శించామన్నారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 8 నుంచి 11వ తేదీలోగా ధ్రువీకరణ పత్రాలతో కళాశాలలో హాజరు కావాలని కోరారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు



పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

బెల్లంపల్లి, జూన్ 7: బెల్లంపల్లి పట్టణంలో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత అన్నారు. శుక్రవారం పట్టణంలోని పెద్దనపల్లి స్టేషన్ ఏరియాలోని 10, 11 వార్డుల్లో మూడు రోజులుగా ఉన్న నీటి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డులో నీటి సమస్య ఉందని తెలియడంతో వెళ్లి పరిశీలించామన్నారు. సిబ్బంది చేత తవ్వించగా కరెంటు స్తంభం అడ్డుగా ఉండడంతో విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించి స్తంభాన్ని పక్కకు జరపాలని సూచించామన్నారు. పట్టణంలో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ డీఈ, ఏఈ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సమ్మయ్య మాదిగ

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 7: త్వరలో జరిగే ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య మాదిగ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఎంఆర్‌పీఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎంఆర్‌పీఎస్ 30 సంవత్సరాల ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మందకృష్ణ మాదిగ సొంత జిల్లా వరంగల్‌లో నిర్వహిస్తామన్నారు. మాదిగ జాతి భవిష్యత్‌కు 30 సంవత్సరాలుగా మందకృష్ణ మాదిగ అనేక పోరాటాలు చేస్తున్నారన్నారు. దేశం మొత్తం మాదిగల వైపు చూసేలా వరంగల్‌లో ఆవిర్భావ వేడుకలను నిర్వహిస్తామన్నారు. వేడుకలకు మాదిగలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. నాయకులు శ్రీనివాస్, శంకర్‌వర్మ, సతీష్ మాదిగ, శంకర్, శేఖర్, రాజలింగు, రాజశేఖర్, ఐలక్క, సుగుణాకర్, విష్ణు, ప్రశాంత్, ఫ్రాన్సిస్, శేఖర్ మాదిగలు పాల్గొన్నారు.

దీపాదాస్ మున్షిని కలిసిన ఎంపీ, ఎమ్మెల్యే



చెన్నూరు, జూన్ 7: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షిని శుక్రవారం పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి కలిశారు. ఎంపీగా గెలుపొందిన గడ్డం వంశీకృష్ణను దీపాదాస్ మున్షి అభినందించారు.

సంక్షేమ ఫలాలకు ఎదురుచూపులు



- కోడ్ ముగియడంతో అధికారులు సమాయత్తం
- ప్రభుత్వ ఫలాల కోసం ప్రజల ఎదురు చూపు
- గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తుల స్వీకరణ
- రైతు భరోసా ఆశలు

మంచిర్యాల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగియడంతో ప్రజాపాలనపై అధికారులు దృష్టి మళ్లిస్తున్నారు. ఎన్నికల సందర్భంగా ఎలక్షన్ కమిషన్ ఆంక్షల మేరకు అభివృద్ధి పనులకు బ్రేక్ పడింది. కనీసం ప్రజల సమస్యలు వినేందుకు కూడా అధికారులకు వెసలుబాటు లేకుండా పోయింది. కేంద్ర ఎన్నికల కమిషన్ ఈ నెల 6 నుంచి కోడ్ ఎత్తివేయడంతో ప్రజలు, అధికారులు పీల్చుకుంటున్నారు.

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎలక్షన్ కమిషన్ మార్చి 8న షెడ్యూల్ విడుదల చేయగా, అదే రోజు నుంచి కోడ్ అమల్లోకి వచ్చింది. ఎన్నికలు ముగియడంతో ప్రజాప్రతినిధులు, అధికారులు ఇక అభివృద్ధిపై దృష్టి సారించనున్నారు. ప్రజల సమస్యలు వినేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రజావాణి' సోమవారం నుంచి నిర్వహించనున్నారు. ఇంతకాలం సమస్యలతో సతమతమైన ప్రజానీకానికి ఇకమీదట తమ సమస్యలు వినేవారు అందుబాటులోకి రానున్నారు.

వేగం పుంజుకోనున్న గృహజ్యోతి

ఎన్నికల ఆంక్షలు తొలగిపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాల్లో భాగమైన గృహజ్యోతి పథకం ద్వారా లబ్ధిదారుల ఎంపిక ప్రారంభం కానుంది. పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడంతో పాటు రూ. 500లకు సబ్సిడీ గ్యాస్ అమలు చేయాల్సి ఉంది. ఈ పథకం కింద జిల్లాలో 2.13 లక్షల దరఖాస్తులు వచ్చాయి. అర్హుల్లో అనేక మందికి పథకం అమలు కాకపోవడంతో మళ్లీ దరఖాస్తులు స్వీకరించాలని నిర్ణయించారు. త్వరలోనే గృహజ్యోతి పథకం దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి.

రైతు భరోసా అమలైతే..!

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రైతు భరోసా పథకం ద్వారా రైతులకు పంట సాయం పెట్టుబడి అందజేయనుంది. వానాకాలం సీజన్‌లో పథకం కింద ఎకరాకు రూ.7500 సాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. సీజన్ ఇప్పటికే ప్రారంభమైనందున రైతులు వేచి చూస్తున్నారు. పథకం అమలైతే రైతులకు పంట సాయం అందడంతోపాటు కౌలు రైతులకు, రైతు కూలీలకు ఏడాదికి రూ. 12 వేల చొప్పున అందించాల్సి ఉంది. అయితే పథకం అమలుపై ఇంకా స్పష్టత రానందున ఈ సీజన్‌కు పంట సాయం అందుతుందో లేదో తెలియని పరిస్థితులు ఉన్నాయి. ఒకవేళ పథకం ప్రారంభిస్తే జిల్లాలోని సుమారు లక్షా 50వేల మంది రైతులు, సుమారు 10వేల మంది కౌలు రైతులకు మేలు చేకూరే అవకాశం ఉంది.

ఇందిరమ్మ ఇళ్లకు మార్గం సుగమం..

కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్లులేని పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు ఇందిరమ్మ పథకం ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా సొంత స్థలం ఉండి, ఇళ్లు నిర్మించుకోవాలనుకునే వారికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించనుంది. ఈ పథకానికి సంబంధించి ఇప్పటికే ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించగా జిల్లాలో 2లక్షల 10వేల 206 దరఖాస్తులు వచ్చాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన డబుల్ బెడ్రూం ఇళ్ల పథకం విఫలం కావడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదు. అర్హులకు పథకం అందకపోగా, అనర్హులకు ఇళ్లు ఇచ్చారనే అపవాదులు ఉన్నాయి. పైగా నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్రూం ఇళ్లను కూడా లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. దీంతో డబుల్ ఇళ్లపై ఆశలు వదిలేసుకున్న అర్హులకు ఇందిరమ్మ పథకం మళ్లీ కొత్త ఆశలు చిగురింపజేస్తోంది. అయితే ఇందిర మ్మ పథకం కోసం ఇప్పటికే దరఖాస్తులు స్వీకరించి నందున అర్హులను గుర్తించి, వీలైనంత త్వరలో పథకం అమలు చేయాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

గ్రూప్ 1 అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి



విద్యార్థినిని అభినందిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 7: గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష ఈనెల 9న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జరుగుతుందని కలెక్టర్ బదావత్ సంతోష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్‌లను టీజీపీఎస్సీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఉదయ 9 గంటల నుంచి 10 గంటల వరకు మాత్రమే అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు. 10 గంటలు దాటిన తర్వాత కేంద్రాల్లోకి అనుమతి ఉండదన్నారు. పరీక్ష కేంద్రాలను ముందుగానే అభ్యర్థులు నిర్ధారించుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రంలో 9.30 గంటలకు బయోమెట్రిక్ అటెండెన్స్ ప్రారంభి స్తారన్నారు. బయోమెట్రిక్ తీసుకునేందుకు అభ్య ర్థుల వేళ్లపై మెహందీ, టాటూస్, ఇతరత్రా ఉండరాదని తెలిపారు. బూట్లు, మొబైల్‌ఫోన్‌లు, నోట్స్, జువెల్లరీ తదితర ఉపకరణాలకు అనుమతి ఉండద న్నారు. జిల్లాలో 27 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, 9,384 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నారని, పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలను కల్పిస్తామన్నారు. అభ్యర్థుల సందేహాల నివృత్తి, సహాయానికి ప్రత్యేక హెల్ప్‌లైన్ నెంబర్ 08736-250500 ఏర్పాటు చేశామని తెలిపారు.

విద్యార్థిని అభినందించిన కలెక్టర్

తాండూర్ కేజీబీవీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని దుర్గం మమత ఇంటర్ ఫలితాల్లో 979 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంకు సాధించగా శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ బదా వత్ సంతోష్ విద్యార్థిని అభినందించారు. శాలువా తో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. ముస్ముం దు కూడా మంచి ఫలితాలు సాధించాలని సూచిం చారు. డీఈవో యాదయ్య, కళాశాల ప్రత్యేకాధికారి సుమనచైతన్య, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రితో ముఖాముఖికి విద్యార్థి ఎంపిక



రాథోడ్ ఈశ్వర్

జన్నారం, జూన్ 7 :ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ముఖాముఖికి మండలంలోని కిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థి రాథోడ్ ఈశ్వర్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు గుండ రాజన్న శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ కిష్టాపూర్ పాఠశాలలో పదో తరగతి పరీక్షలో 10 జీపీఏ సాధించిన ఈశ్వర్ వందేమాతరం ఫౌండేషన్, విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 9న హైద్రాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించే సీఎంతో ముఖాముఖి కార్యక్రమానికి ఎంపిక య్యాడని తెలిపారు. విద్యార్థిని, అతని తల్లిదండ్రులను సీఎం సన్మానించనున్నట్లు తెలిపారు. ఎంఈవో విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

మంత్రి పొన్నంను కలిసిన నాయకులు



మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

భీమారం, జూన్ 7 : హైద్రాబాద్‌లో శుక్రవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బీసీ స్టేట్ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి మోహన్‌రెడ్డి, యూత్ జనరల్ సెక్రెటరీ రమేష్, నాయకులు రాము, మధుకర్‌లు మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రిని శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు. మండల అభివృద్ధికి సహకరించాలని, పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట వేయాలని విన్నవించారు.

పోడుపై పోరుబాట తప్పదు

● బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ


మాట్లాడుతున్న కొంగ సత్యనారాయణ

కాగజ్‌నగర్, జూన్ 7: పోడు వ్యవసాయంలో అటవీ శాఖ అధికారులు తీరుపై పోరుబాట తప్పదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కొంగ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన కడంబా అటవీ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. తాతాల నాటి నుంచి పోడు వ్యవసాయం చేసుకుంటున్న వారిపై కూడా అటవీశాఖ అధికారులు కేసులు బనాయించటం దారుణమన్నారు. ఈ విషయంలో ఊరుకునేది లేదన్నారు. కడంబాలో పోడు వ్యవసాయం చేసే వారిపై తప్పుడు కేసులు నమోదుచేయటం ఎంతవరకు సమంజసమన్నారు. ఇదే గ్రామంలో కొంతమంది రైతులు పోడుభూములకు ప్రహరీపెట్టి పోడు చేస్తున్నా కూడా అటవీశాఖ అధికారులు వత్తాసు పలకటం, మిగితావారిపై కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడి అక్రమకేసులు పెట్టడమేంటనీ ప్రశ్నించారు. కడంబాలో పనిచేస్తున్న అటవీశాఖ అధికారులు, సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారన్నారు. తప్పుడు నిర్ణయాలు చేస్తే ఊరుకోమన్నారు. సమావేశంలో పోడు రైతులు పాల్గొన్నారు.

బడిబాటను విజయవంతం చేయాలి: కలెక్టర్


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీటీసీ, తదితరులు

రెబ్బెన, జూన్ 7: బడిబాటను విజయవంతం చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం మండలంలోని తక్కళ్లపల్లిలో ఏర్పాటు చేసిన బడిబాట కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సహకరించి తమ పిల్లలను తప్పనిసరిగా పాఠశాలకు వచ్చేట్లు చూసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలలో మెరుగైన విద్యను అందుతుందన్నారు. పిల్లలను ప్రయివేటులో చేర్పించి ఆర్థికంగా నష్టపోకూడదన్నారు. ప్రభుత్వపాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించటానికి అధికారులు సిద్ధంగాఉన్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ఎంపీటీసీ శ్రీనివాస్ పాఠశాలలో మెరుగైన వసతులు కల్పించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎంపీపీ సౌందర్య, డీఈవో అశోక్, తదితరులు పాల్గొన్నారు.

మండలాల్లో బడిబాట..

కౌటాల/చింతలమానేపల్లి/కెరమెరి/సిర్పూర్(యు)/దహెగాం: బడిబాటలో భాగంగా మండలాల్లోని గ్రామాల్లో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు ఇంటింటికి తిరిగి బడిబయట ఉన్న పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి తమపిల్లలను బడికి పంపించాలని అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు బడిబాటలో భాగంగా ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులు రమేష్, నారాయణ, సత్యనా రాయణ తదితరులు పాల్గొన్నారు. చింతల మానేపల్లిలో జడ్పీఎస్ఎస్ ప్రధానోపాధ్యాయుడు మోసిన్, పంచా యతీకార్యదర్శి ఇస్తారి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు భీంరావు, రఘుపతి, తదితరులు పాల్గొన్నారు. కెరమెరిలో నోడల్ అధికారి ప్రకాష్ ఆధ్వర్యంలో సుర్దాపూర్, నెహ్రు నగర్, సుల్తాన్‌గూడ పాఠశాలల విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీచేశారు. సిర్పూర్(యు)ఎంఈవో కుడ్మెత సుధాకర్ మాట్లాడుతూ గ్రామీణప్రాంత విద్యార్థులు విద్యపరంగా ముందుకు సాగేలా ప్రభుత్వం బడిబాటను అమలు చేస్తోందన్నారు. గ్రామస్థులు తప్పక చిన్నారులను పాఠశాలలో చేర్పించాలని కోరారు.

106 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత


పట్టుకున్న రేషన్‌బియ్యంతో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

సిర్పూర్(టి), జూన్ 7: సిర్పూర్(టి) మీదుగా మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న 106క్వింటాళ్ల పీడీఎస్‌బియ్యంను శుక్రవారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ బి ప్రశాంత్ రావు, ఎ దినేష్‌చంద్రారెడ్డి, సివిల్ సప్లయి ఎన్‌ఫోర్స్ మెంట్ డీటీశ్రీనివాస్ పట్టు కున్నారు. వారు తెలిపినవివరాల ప్రకారం..ముందస్తుగాఅందిన సమాచారం మేరకు సిర్పూర్(టి)లో వాహనాల తనిఖీ చేపడుతుండగా మూడు వ్యాన్(టీఎస్9టి 8750, టీఎస్ 13యూ 2103, టీఎస్13యూసీ 4024)లలో మహారాష్ట్రలోని ప్రకాష్‌సేట్ గోదాంకు రవాణాచేస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వాహనాలను సీజ్‌చేసి కాగజ్‌నగర్‌కు చెందిన గడ్డం వంకర్‌గౌడ్, గులాం అఫ్రోజ్ అహ్మద్, ఎండీశంషాద్, బోయిని రమేష్, అక్బర్, నీలం రాజ్‌కుమార్‌పై 6ఏకేసు, క్రిమినల్‌కేసు నమోదుచేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా ఎవరైనా పీడీఎస్ బియ్యం అక్రమరవాణాచేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య


కళ్యాణ్(ఫైల్)

వాంకిడి, జూన్ 7: మండలంలోని కనర్‌గాంగ్రామానికి చెందిన జాడి కళ్యాణ్(20) శుక్రవారం పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. జాడి కళ్యాణ్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. కొద్దిరోజులుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. శుక్రవారం కడుపు నొప్పిభరించలేక పురగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు.

బాలకృష్ణను కలిసిన గుళ్లపల్లి ఆనంద్

కాగజ్‌నగర్, జూన్ 7: హిందుపురం ఎమ్మెల్యే బాలకృష్ణను శుక్రవారం హైదరాబాద్‌లో ఉమ్మడిఆదిలాబాద్ జిల్లా టీడీపీ కన్వీనర్ గుళ్లపల్లి ఆనంద్ కలిశారు.ఎమ్మెల్యేగా గెలిచిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు సమస్యలపై చర్చించారు.

బాధ్యతలు స్వీకరించిన రేవయ్య

రెబ్బెన, జూన్ 7: మండలంలోని తుంగెడ గ్రామానికి చెందిన దళితయువకుడు డోంగ్రె దేవయ్య 2022-23 సవిల్ సర్వీస్‌లో 410ర్యాంకు సాధించాడు. శుక్రవారం ఆయన మహారాష్ట్ర వార్ధాతాలుకాలో అదనపుపాలనాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అయనను కుటుంబసభ్యులు, బంధువులు, ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

బండి సంజయ్‌ను కలిసిన ఎమ్మెల్యే హరీష్‌బాబు


ఎంపీ బండి సంజయ్‌తో ఎమ్మెల్యే హరీష్‌బాబు

కాగజ్‌నగర్, జూన్ 7: కరీంనగర్ ఎంపీగా గెలిచిన బండి సంజయ్‌ను శుక్రవారం న్యూఢిల్లీలో సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు కలిశారు. ఎంపీగా గెలిచిన సందర్భంగా శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు.

బెల్లం పానకం ధ్వంసం

తిర్యాణి, జూన్ 7: మండలంలోని గంభీరావుపేట గ్రామంలో శనివారం 2వేల లీటర్ల బెల్లంపానకం ధ్వంసం చేసినట్లు ప్రొహిబీషన్ సీఐ డి దీపక్ తెలపారు. ఆకస్మిక తనిఖీ నిర్వహించి గ్రామశివారులో ఉన్న 2వేల లీటర్ల బెల్లంపానకం ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై రమేష్, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్, కానిస్టేబుళ్లు సురేష్, మమత, రజిత తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

బెజ్జూరు, జూన్ 7: ఇటీవల ఈదురుగాలుల బీభత్సంతో మండలంలోని పలుగ్రామల్లో ప్రజల ఇళ్లపైకప్పు రేకులు ఎగిరిపోయిన, గోడలు కూలిపోయిన బాధితుల నుంచి శుక్రవారం డిప్యూటీతహసీల్దార్ భీమ్లానాయక్ దరఖాస్తులు స్వీకరించారు. ఈదురుగాలుల బీభత్సంతో పలువురి ఇళ్లు దెబ్బతిన్న కారణంగా ప్రజలు ఆందోళన చెందగా తహసీల్దార్ కార్యాలయంలో ఆధార్‌కార్డు, ఫొటోలతో దరఖాస్తు చేసుకున్నట్లయితే ప్రభుత్వం నుంచి నష్టపరిహారం రాగానే ఇస్తామని పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు

దండేపల్లి, జూన్ 7: విద్యార్థులకు ఉచితంగా వచ్చిన పాఠ్యపుస్తకాలను శుక్రవారం దండేపల్లిలో విద్య వనరుల కేంద్రంలో ఆయాపాఠశాల ప్రధానోపాధ్యాయులకు 2023-24 విద్యాసంవత్సరానికి గాను పంపిణీచేశారు. ఆయాపాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాఠ్యపుస్తకాలనుతీసుకువెళ్లాలని కోరారు.

ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

బెల్లంపల్లి, జూన్ 7: జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దీపక్ కుమార్ శుక్రవారం డీఈవో యాదయ్యకు వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభమవుతున్నందున ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తల్లిదండ్రులను ఫీజుల పేరుతో దోపిడి చేస్తున్నాయన్నారు. సరైన వసతులు, భవనాలు లేకుండా పాఠ శాలలు నడుస్తున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నకిలీ పత్తి విత్తనాల జోరు

- అడ్డదారుల్లో పల్లెలకు చేరుతున్న విత్తనాలు
- గ్రామాల్లో టాస్క్‌ఫోర్స్ బృందం దాడులు
- భారీగా పట్టుబడుతున్న లూజు విత్తనాలు
- అనుమతి లేకున్నా బీటీ-3 వైపే మొగ్గు



నెన్నెల మండలం బొప్పారంలో పట్టుబడ్డ నకిలీ పత్తి విత్తనాలు

నెన్నెల, జూన్ 7: కలుపు బాధ ఉండదనే ఆశతో బీటీ-3 (గ్లైసిల్) విత్తనాల వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. తక్కువ ఖర్చుతో కలుపు నివారించవచ్చనే ఆలోచన తప్ప దీర్ఘకాల పర్యవసానాలపై వారికి అవగాహన లేదు. జిల్లాలో 65 శాతం రైతులు గ్లైసిల్ విత్తనాలే వాడు తున్నారు. బీటీ-3 విత్తనాలను అదుపు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుండగా అడ్డదారిలో గ్రామాలకు చేరుతున్నాయి. గుట్టుచప్పుడు కాకుండా అమ్మకాలు సాగుతున్నాయి.

గ్లైసిల్ అంటే..?

సాధారణంగా కలుపు మందు పిచికారి చేస్తే గడ్డి సహా అందులోని మొక్కలన్నీ ఎండిపోతాయి. బీటీ-3 విత్తనం మాత్రం కలుపు మందు స్ప్రే చేసినా పత్తి మొక్కలకు ఎలాంటి హాని జరగదు. కలుపు మొక్కలు, గడ్డి పోచలు సహా మాడిపోతాయి. రూ.300 నుంచి రూ.350కు మాత్రమే లీటరు లభించే గ్లైఫోసెట్ అనే కలుపు నివారణ మందు ఒక ఎకరానికి సరిపోతుంది. రెండు మూడుసార్లు పిచికారి చేస్తే పంటకాలం పూర్తయ్యే వరకు కలుపు బెడద ఉండదు. అనధికారికంగా తయారు చేసిన లూజు విత్తనాలతోపాటు 500 గ్రాముల ప్యాకెట్లలో లభిస్తాయి. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి తక్కువ ధరకు తీసుకువచ్చి ఇక్కడ కేజీకి రూ.2500ల నుంచి రూ. 3 వేల వరకు అమ్ముతున్నారు.

జీవవైవిధ్యానికి ముప్పు

గ్లైఫోసెట్ మందును కేవలం తేయాకు తోటల్లో వేయడానికి మాత్రమే దేశంలో అనుమతి ఉంది. బీటీ-3 పత్తి పంటలో కలుపు నివారణకు ఇదే మందును వాడాల్సి ఉంటుంది. ఈ మందుల వాడకంతో జీవవైవిధ్యానికి నష్టం జరుగుతుందని నిపుణులంటున్నారు. గ్లైఫోసెట్ మందును పత్తి పంటకు పిచికారి చేస్తే అది ఇతర పంటలపైన ప్రభావం చూపుతుంది. ఆహారంగా తీసుకునే వారిలో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని, కేన్సర్ బారిన పడే అవకాశాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు అంటున్నారు. భూమి నిస్సారమయ్యే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. బీటీ-3 సాగుతో చేలు విషతుల్యమై భూసారం దెబ్బతింటుంది.

బీటీ-3 విత్తనాలపై ఉక్కుపాదం

బీటీ-3 సాగును ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. అనుమతి లేకుండా సాగు చేస్తు న్న మూడో రకం బీటీ పత్తి విత్తనాలపై దృష్టి సారించింది. జీవవైవిధ్యానికి ముప్పు వాటిల్లుతుండటంతో ఈ విత్తనాలు అమ్మకుండా చర్యలు తీసుకుంటున్నది. పోలీసు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా టాస్క్‌ఫోర్స్‌గా ఏర్పడి దాడులు చేస్తున్నారు. గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. నకిలీ విత్తనాలు అమ్మేవారిపై పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఈ మేరకు అధికారులు నిఘా పెంచారు. కాని మధ్య దళారులు అక్రమ మార్గాల్లో విత్తనాలను గ్రామాలకు తెచ్చి రైతులకు అంటగడుతూనే ఉన్నారు. నిషేధిత విత్తనాలు సాగు చేసి రైతులు నష్ట పోతున్నారు. అవగాహన లేక పర్యావరణానికి తీరని చేటు చేస్తున్నారు.

ప్రత్యామ్నాయం ఏది

బీటీ-2కు ప్రత్యామ్నాయగా మరో విత్తనం ఇంతవరకు మార్కెట్‌లోకి రాలేదు. బీటీ-1, బీటీ-2 పత్తి విత్తనాలు చీడపీడలను తట్టుకోవడంలో విఫలమయ్యాయి. వాటికి గులాబీ రంగు పురుగు, లద్దె పురుగు సోకుతుండటంతో నష్టం వాటిల్లుతోంది. బీటీ-1, బీటీ-2లతో నష్టపోయిన రైతులు బీటీ-3 విత్తారు. కూలీల కొరత తీవ్రంగా వేధిస్తుండగా, కలుపు బెడద లేని గ్లైసిల్ విత్తులు రావడం రైతులకు ఊరటనిచ్చింది. పెట్టుబడి సగానికి తగ్గుతుందని చాలా మంది బీటీ-3నే సాగు చేసేందుకు మొగ్గు చూపి స్తున్నారు. బీటీ-3ని ప్రభుత్వం నిషేధించింది. అనధికారికంగా విక్రయిస్తున్న విత్తనాల అమ్మకాలకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపడుతోంది. దాడుల్లో భారీగా విత్తన నిల్వలు పట్టుబడుతున్నాయి.

జిల్లాలో పట్టుబడిన విత్తనాలు

- నెన్నెల మండలం బొప్పారంలో కర్నకొండ చంద్రశేఖర్ ఇంట్లో రూ.15 లక్షల విలువ గల 5 క్వింటాళ్ల లూజు విత్తనాలను పట్టుబడ్డాయి.
- మే 22న మంచిర్యాల సురేష్ యాదవ్‌కు చెందిన రూ.36 లక్షల విలువ గల 1140 కేజీల లూజు విత్తనాలు కర్ణాటక నుంచి తరలిస్తుండగా చేవెళ్ల ప్రాంతంలో అక్కడి పోలీసులు పట్టుకున్నారు.
- మే 23న తాండూరు మండలం కొత్తపల్లిలో ఎంబోతు రాజు ఇంట్లో 30 కేజీల పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు.
- మే 25న బొప్పారం గ్రామానికి చెందిన నార పురుషోత్తంకు చెందిన 20 కేజీల నకిలీ విత్తనాలు పట్టుకున్నారు.
- మే 28న చెన్నూరు వద్ద ఉల్లిగడ్డల వ్యాన్‌లో తరలిస్తున్న రూ.16.50 లక్షల విలువగల 5.50 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి.
- జూన్ 5న వేమనపల్లి సమీపంలో ప్రాణహిత నది ఫెర్రీ పాయింట్ వద్ద మహారాష్ట్ర నుంచి వేమనపల్లికి ఎడ్ల బండిలో తరలిస్తున్న 2.05 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి.

బడిబాటను విజయవంతం చేయాలి



కొలాంగూడ, పులిమడుగులో బడిబాట ర్యాలీ

హాజీపూర్, జూన్7: మండలంలోని కొలాంగూడ, దొనబండ గ్రామాల్లో శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ర్యాలీ నిర్వహిస్తూ ఇంటింటికి వెళ్లి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఎంఎన్‌వో హన్మాండ్లు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, బడీడు పిల్లలందర్ని బడిలో చేర్పించాలని ఎంపీడీవో రాజేశ్వర్ సూచించారు. శుక్రవారం పులిమడుగులో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. ఉచిత, పుస్తకాలు అందిస్తామని తెలిపారు. ఉపాధ్యాయులు , మాజీ సర్పంచు, అంగన్‌వాడీలుపాల్గొన్నారు.

కాసిపేట: దేవాపూర్‌లో శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల నోడల్ ఆఫీసర్, దేవాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాథోడ్ రమేష్, ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, మధ్యాహ్న భోజనం, ఉచిత పుస్తకాలు, యూనిఫాంలు అందిస్తామని తల్లిదండ్రులకు తెలిపారు. ఉపాధ్యాయులు సురేష్‌బాబు, అంజద్‌పాషా, అచ్చన్న, రాజేష్, మల్లేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి: ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందని, పిల్లలను చేర్పించాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కోరారు. బడిబాటలో భాగంగా శుక్రవారం పలు గ్రామాల్లో ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించి విద్యార్థుల ఇండ్లకు వెళ్లి పిల్లలను చేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉంటారని, విద్యార్థుల భవిష్యత్‌కు ఎంతో ఉపయోగపడుతుందని సూచించారు. ఉచితంగా పాఠ్య పుస్తకాలు, దుస్తులను అందజేస్తుందన్నారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్‌పి, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

అర్హులకు న్యాయం జరిగేలా చూస్తాం

కన్నెపల్లి, జూన్ 7: అర్హులకు న్యాయం జరిగేలా చూస్తామని బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ అన్నారు. కొత్తపల్లి గ్రామశివారులో రైతులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు లేకపోవడంతో ఫారెస్టు అధికారులు అడ్డుకున్నారు. ఈ విషయం రైతులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం ఫారెస్టు, రెవెన్యూ అధికారులు జాయింట్ సర్వే చేపట్టారు. ఆర్డీవో హరికృష్ణ మాట్లాడుతూ అర్హులైన రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, గిర్దావర్ కిషన్‌రావు, మండల సర్వేయర్ సంతోష్, కాంగ్రెస్ నాయకులు నర్సింగరావు, రామాంజనేయులు , రైతులు పాల్గొన్నారు.

ఓసీపీని సందర్శించిన డైరెక్టర్

జైపూర్, జూన్ 7 : ఇందారం ఓసీపీని సింగరేణి డైరెక్టర్ ఈఅండ్‌ఎం సత్యనారాయణరావు శుక్రవారం ఏరియా జీఎం సంజీవరెడ్డితో కలిసి సందర్శించారు. గని ప్రాజెక్టు ప్లాన్‌ను పరిశీలించారు. పంపు మోటార్లకు సంబంధించిన అంశాలను తెలుసుకున్నారు. డైరెక్టర్ మాట్లాడుతూ భారీ యంత్రాల వినియోగాన్ని పెంచాలని, వాటి ద్వారా వీలైనంత ఎక్కువ ఉత్పత్తిని సాధించాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని బొగ్గు ఉత్పత్తికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ డైరెక్టర్ రావు, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఇందారం ఓసీపీ అధికారి శ్రీనివాస్, ప్రాజెక్టు ఇంజనీర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి



ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్‌కు వినతి

బెల్లంపల్లి, జూన్ 7: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని శుక్రవారం టేకులబస్తీ 15వ వార్డుకు చెందిన యువకులు బెల్లంపల్లి ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. వార్డులోని మురికి కాలువలు నిండిపోయి ఉన్నాయని, వర్షాలు కురిస్తే కాలువల్లో నుంచి నీరు ఇండ్లలోకి వచ్చే అవకాశం ఉందని తెలి పారు. మురికి కాలువలను శుభ్రం చేయాలని, దోమల నివారణకు చర్య లు చేపట్టాలని, మిషన్ భగీరథ నీరు అందరికి అందేలా పైపులైన్ వే యాలని కోరారు. లోకేశ్వర్, బొల్లి వంశీ, రావణ్, శ్యామ్, నగేష్, రాజు పాల్గొన్నారు.

మంచిర్యాల జిల్లాకు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలి

ఏసీసీ, జూన్ 7: మంచిర్యాల జిల్లాకు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలని బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు అన్నారు. శుక్రవారం ఐబీ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాంకిడిలో జన్మించి స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొని ఎమ్మెల్యే, మంత్రి పదవులను అలంకరించారన్నారు. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీకి బీఆర్‌ఎస్ ప్రభుత్వం సరైన గుర్తింపు ఇవ్వలేదన్నారు. టీఆర్‌ఎస్ పార్టీని ప్రారంభించినప్పుడు లక్ష్మణ్ బాపూజీ ఇంటిని పార్టీ కార్యాలయానికి ఇచ్చారన్నారు. ఆయనకు సరైన గౌరవం దక్కాలంటే జిల్లాకు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలన్నారు. నాయకులు గుమ్ముల శ్రీనివాస్, తుల మదుసూదన్ రావు, గజెల్లి వెంకన్న, రమేష్‌వర్మ, రాములు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు

మంచిర్యాల, లక్షెట్టిపేట

మార్కెట్ కమిటీల కార్యవర్గం

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

మంచిర్యాల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల, లక్షెట్టిపేట మార్కెట్ కమి టీలకు చైర్మన్లను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ, కో ఆపరేషన్ డిపార్టుమెంట్ శుక్రవారం జీఓఆర్టీ నెంబర్లు 445,446 జారీ చేసింది. రెండు మార్కెట్ కమిటీల పదవీకాలం 2022 డిసెంబరు 18న ముగిసింది. అప్పటి నుంచి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు కార్యవర్గాన్ని ఎంపిక చేసి ప్రభుత్వానికి అందజేశారు. ఎన్నికల కోడ్ ముగి యడంతో కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. లక్షెట్టి పేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా దాసరి ప్రేంచంద్, వైస్ చైర్మన్‌గా ఎండీ ఆరిఫ్, సభ్యులుగా గాండ్ల విజయ్ కుమార్, కనక జంగు, కట్కూరి రాజన్న, గోపతి సునీత, తోట రమేష్, పొలుసాని రవీంధర్‌రావు, బండ రాకేష్, బొప్పు వెంకటేశ్, గంగుల వెంకటస్వామి, పలకుర్తి బుచ్చయ్య, బీరెల్లి రాజన్న, మల్యాల గణపతి స్వామి నియమితులయ్యారు. మంచిర్యాల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా పయ్యావుల పద్మ, వైస్ చైర్మన్‌గా బండారి సుధాకర్, సభ్యులుగా ఎండీ తాజ్‌ముల్ అహ్మద్, వొన్నోజుల శ్రీనివాస్, పల్లపు సావిత్రి, బదావత్ రమేష్, సూరం సతీష్, తనుగుల సత్యనారాయణ, నరిశెట్టి సంతోష్, దోనెపెల్లి లింగయ్య, ధర్ని మల్లేష్, సిద్దం జనార్దన్, మహేష్ కుమార్ జాజు, రావుల మహేష్‌లు నియమితులయ్యారు. ఈ కమిటీలు రెండు సంవత్సరాలపాటు పదవిలో కొనసాగనున్నాయి.

జర్నలిస్టులు ఐక్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలి

జన్నారం, జూన్ 7: జర్నలిస్టులు ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా అధ్యక్షుడు డేగ సత్యం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. జర్నలిస్టులను ప్రభుత్వం ఆదుకోవాలని, అక్రిడిటేషన్ ఉన్న వారికి ఇండ్ల స్థలాలు అందజేయాలని, గృహ నిర్మాణానికి ఆర్థిక సహాయం, హెల్త్‌కార్డులు పొందేందుకు సమిష్టిగా కృషి చేయాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షులుగా నరసయ్య, లింగన్న, కార్యదర్శిగా ఎనగందుల సత్యంను నియమించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రకాష్‌రెడ్డి, కోశాధికారి వంశీకృష్ణ, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో ప్రాజెక్ట్ కాలువ మరమ్మతు



మరమ్మతు పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

భీమిని, జూన్ 7 : బిటూరుపల్లి సమీపంలో రాంపూర్ ఎడమ కాలువ తెగిపోవడంతో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సొంత ఖర్చులతో మరమ్మతు చేపట్టారు. గతేడాది వర్షాలకు కాలువ తెగిపోవడంతో పొలాలు నీట మునుగు తున్నాయని రైతులు నాయకుల దృష్టికి తీసుకపోయారు. సీనియర్ నాయకులు మాధవరపు నర్సింగరావు స్పందించి సొంత ఖర్చులతో కాలువకు మరమ్మతు చేయించారు. నాయకులు లక్ష్మీనారా యణ, రాంటెంకి దశరథ్, రోహిత్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హాజీపూర్, జూన్ 7: హాజీపూర్ విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతు కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాజీపూర్, టీకనపల్లి, దొనబండ, రాంపూర్, పెద్దంపేట, బుద్దిపల్లి, కొండాపూర్, కర్ణమామిడి, పడ్తన్‌పల్లి గ్రామాల్లో విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

బెల్లం విక్రయాలపై ఆంక్షలు

జన్నారం, జూన్ 7: గుడుంబా తయారీలో బెల్లం వాడుతున్నందున అధిక మోతాదులో బెల్లం విక్రయించవద్దని లక్షెట్టిపేట ఎక్సైజ్ సీఐ నరసింహులు సూచించారు. శుక్రవారం మండలంలోని పొనకల్ గ్రామంలోని వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బెల్లాన్ని కొందరు గుడుంబా తయారీకి వినియోగిస్తున్నారన్నారు. బెల్లం అమ్మినట్లు తెలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దుకాణాల్లో 20 కిలోలకు మించి బెల్లం ఉండవద్దని, ఒక కిలో బెల్లం ఎవరైనా తీసుకుంటే వారి ఫోన్, ఆధార్ నెంబరు తీసుకున్న తర్వాతనే విక్రయించాలన్నారు. వర్తక సంఘం అధ్యక్షుడు వామన్, కార్యదర్శి రమేష్, వర్తకులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో జైలు శిక్ష

ఏసీసీ, జూన్ 7: దొంగతనం కేసులో నేరస్తుడికి జైలు శిక్ష విధిస్తూ మంచిర్యాల జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి కె.నిరోషా శుక్రవారం తీర్పునిచ్చారు. మార్చి 27న హైటెక్ సిటీలో నిర్మిస్తున్న అపార్టుమెంట్ వద్ద రూ.5250 విలువైన 15 పైపులు ఎత్తుకెళ్లినట్లు అపార్టుమెంట్ ఓనర్ వంశీ ఫిర్యాదుమేరకు ఎస్ఐ లక్ష్మణ్ కేసు నమోదు చేశారు. నిందితున్ని పట్టుకుని కోర్టులో హాజరుపర్చి చార్జ్‌షీట్ దాఖలు చేయగా ఏపీపీ ప్రేమలత, సీడీవో శ్రీనివాస్, లైజన్ ఆఫీసర్ గులాం దస్తగిరిల సహకారంతో సాక్షులను ప్రవేశపెట్టి వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో జడ్జి నేరస్తునికి 2 నెలల 7 రోజుల జైలు శిక్ష, రూ. 200 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

మరమ్మతు పనులను వేగంగా పూర్తి చేయాలి

మందమర్రిరూరల్, జూన్ 7: చిర్రకుంట, శంకర్‌పల్లి గ్రామాల్లోని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న మరమ్మతు పనులను శుక్రవారం ఎంపీడీవో రాజేశ్వర్ పరిశీలించారు. పనులను నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఏపీఎం లలితకుమారి, ఆదర్శ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కుమరం భీం
జిల్లా వార్తలు

8

శనివారం 8 జూన్ 2024

పిల్లలు బడిలో చేరేలా..

- ప్రారంభమైన బడిబాట ప్రత్యేక కార్యక్రమాలు
- ప్రభుత్వ విద్య బలోపేతానికి చర్యలు
- గ్రామాల్లో ఉపాధ్యాయుల ప్రచారం
- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనలపై అవగాహన
- 19వతేదీ వరకు రోజుకో ప్రత్యేక కార్యక్రమం
- విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యం



గ్రామాల్లో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

వాంకిడి, జూన్ 7: పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ పాఠశాలలతో ప్రభుత్వ విద్యావ్యవస్థ ప్రమాదంలో పడింది. ఈ క్రమంలో సర్కారు పాఠశాలలను కాపాడు కోవడం విద్యాశాఖకు కత్తిమీద సాములామారింది. అందుకని ప్రభుత్వ పాఠశాలల్లోకి విద్యార్థులను ఆకర్షించడం కోసం ప్రభుత్వం ఏటా విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. అందులో భాగంగా ఈ ఏడాది జూన్ 6 నుంచి 19వరకు ఉపాధ్యా యులు రోజుకో కార్యక్రమంతో విద్యార్థులు వారి తలిదండ్రులను కలవనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు, నిష్ణాతులైన ఉపాధ్యాయులచే బోధన, మధ్యాహ్నభోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తుల పంపిణీ, తదితర సౌకర్యాలను వివరిస్తూ పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని అవగాహన కల్పించనున్నారు. ఉపాధ్యాయులు ప్రతి గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ మధ్యలో చదువుమానేసిన వారిని, బాలకార్మికులను గుర్తించి పాఠశాలల్లో చేర్పించేందుకు కృషి చేయనున్నారు. దీంతోపాటు అయిదేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించేందుకు ప్రత్యేకచర్యలు చేపట్టనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్య పెంచలాన్న లక్ష్యంతో ప్రత్యే కార్యాచరణ రూపొందించుకోవాలని విద్యాశాఖ అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది.

విస్తృత ప్రచారానికి సన్నాహాలు..

కొన్నేళ్లుగా విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించేందుకు బడిబాట కార్యక్రమం చేపడుతున్నా సత్ఫలితాలు రావడంలేదు. ప్రస్తుతం ప్రభుత్వం అమ్మ ఆదర్శపాఠశాలల కమిటీల సమన్వయంతో పాఠశాలలను బలోపేతం చేయడం, మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి సదుపాయాలు కల్పిస్తున్నారు. విద్యార్థులు చేరివీటిని సద్వినియోగం చేసుకునేలా ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం ద్వారా విస్తృత ప్రచారం కల్పించనున్నారు.

రోజువారి కార్యక్రమాలు ఇలా..

- 3నుంచి 9వతేదీవరకు గ్రామాలు, ఆవాసప్రాంతాల్లో ప్రత్యేక నమోదు కార్యక్రమం
- 12న మనఊరు మనబడి, మనబస్తీ మనబడి కార్యక్రమాన్ని నిర్వహించాలి. పాఠశాలను మామిడి తోరణాలు, ముగ్గులతో అలంకరించి పండుగ వాతావరణాన్ని ఏర్పాటు చేసుకోవాలి. తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి సమావేశాన్ని నిర్వహించాలి.
- 6 నుంచి 11వ తేదీ వరకు ఉదయం 7నుంచి 11గంటల వరకు ప్రతిరోజూ విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవడం.
- 6వ తేదీన గ్రామస్థాయి డ్రైవ్ చేపట్టి స్వయం సహాయక సంఘాలు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో ర్యాలీలు నిర్వహించాలి.
- 7వ తేదీన ప్రతిఇంటికి వెళ్లి పాఠశాలకు వెళ్లే విద్యార్థులను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలి. పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల వివరాలను రిజిస్టర్లో నమోదు చేయాలి.
- 8 నుంచి 10వ తేదీ వరకు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో అందించే వసతులపట్ల అవగాహన కలిగించి నమోదు చేయించాలి.
- 11న గ్రామసభల ఏర్పాటు చేయాలి
- 12న విద్యార్థులకు స్వాగతదినోత్సం ఏర్పాటు చేసి పాఠశాలలను అందంగా పండుగ వాతావరణలో అలంకరించి రంగోలి తదితర ఉత్సవ కార్యక్రమాలు రూపొం దించాలి. అమ్మ ఆదర్శపాఠశాలల కమిటీల ద్వారాపాఠశాలల్లో చేపట్టిన వసతులను వివరించి తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, కమ్యూనిటీ వారితో సమావేశాలు ఏర్పాటు చేయాలి. గత విద్యా సంవత్సరంలో మంచి ప్రతిభ కనబరిచిన, మంచి హాజరు కలిగిన విద్యార్థులను పోత్సహించిన వారి తల్లిదండ్రులను సన్మానించాలి.
- 13న తరగతి వారిగా విద్యార్థులు తయారు చేసిన విద్యా ప్రమాణాలకు సంబంధించి పోస్టర్లను, చార్ట్స్ ప్రదర్శించి తరగతి గదులను అలంకరించాలి.
- 14న సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం ఏర్పాటు చేసి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల సభ్యులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, కమ్యూనిటీ పెద్దలను భాగస్వామ్యం చేసి పండుగ వాతావరణంలో నిర్వహించాలి. ఉన్నతపాఠశాలల్లో విద్యయొక్క ప్రాముఖ్యత, పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాలపై సాంస్కృతిక కార్యక్రమాలను విద్యార్థులతో ప్రదర్శించాలి.
- 15 బాలికల విద్యాదినోత్సవం జరుపుకోవాలి. బడిబాట కార్యక్రమంలో గుర్తించిన ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను భవిత కేంద్రాల్లో, పాఠశాలల్లో చేర్పించాలి.
- 18న డిజిటల్ తరగతులపై అవగాహన కార్యకమాలు, తరగతి వారీగా విద్యార్థులతో మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలి. పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టిన విషయాన్ని ఇంటింటా చదువుల పంట అనేయాప్ గురించి తల్లిదండ్రులకు తెలియజేయాలి.
- 19న క్రీడా దినోత్సవం ఏర్పాటు చేసి విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, ఆటల పోటీలు నర్వహించాలి.

ముమ్మరంగా బడిబాట కార్యక్రమం..

వాంకిడి మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మధ్యలో బడిమానేసిన విద్యార్థులను, బాలకార్మికులను ఇంటింటికి వెళ్లి ఉపాధ్యాయులు గుర్తించారు. విద్యార్థు లను వ్యవసాయ కూలీ పనులకు తీసుకువెళ్లకుండా పాఠశాలలకు పంపించాలని ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సంక్షేమపథకాలను ఈ సందర్భంగా విద్యార్థుల తల్లి దండ్రులకు వివరించారు. కార్యక్రమంలో సీఆర్పీ దుర్గం సందీప్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

పకడ్బందీగా బడిబాట కార్యక్రమం: ఎంఈవో మనుకుమార్



ఈ నెల 6నుంచి నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమం పకడ్బందీగా చేపట్టనున్నాము. ప్రతిగ్రామానికి ఉపాధ్యాయులు వెళ్లి మధ్యలో బడి మానేసిన, బాలకార్మికులను గుర్తించి తిరిగి వారిని పాఠశాలలో చేర్పిం చేందుకు చర్య లు తీసుకుంటాము. ఈనెల 19వరకు చేపట్టాల్సిన బడి బాట విజయ వంతంగా పూర్తిచేసేలా అన్నివిధాల కృషి చేస్తున్నాం.

జిల్లాకుచేరుకున్న గ్రూప్-1 పరీక్ష ప్రశ్నాపత్రాలు

ఆసిఫాబాద్, జూన్ 7: ఈనెల 9న జిల్లాలో జరగనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్‌లు జిల్లాకు చేరుకున్నట్లు అదనపు కలెక్టర్ దీపక్‌తివారి తెలిపారు. శుక్రవారం జిల్లాకు చేరుకున్న గ్రూప్1 సర్వీసెస్ ప్రిలిమిరీ పరీక్ష ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్‌షీట్‌లను జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లోగల స్ట్రాంగ్‌రూంలో పూర్తిబందోబస్తు మధ్య భద్రపరిచామని తెలిపారు. జిల్లాలోగ్రూప్-1ప్రిలిమినరీ పరీక్షపకడ్బందీగా నిర్వహించేందుకు పూర్తి ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ జిరాక్స్ సెంటర్లను మూసిఉంచామని తెలిపారు. కార్యక్రమంలో పరీక్షల జిల్లా సమన్వయకర్త లక్ష్మీనరసింహ, జిల్లా ఖజానాఅధికారి రాజేశ్వరి, ఆసిఫాబాద్ సీఐ సతీష్, కలెక్టరేట్ పర్యవేక్షకులు మునావర్ షరీఫ్ పాల్గొన్నారు.

మూగజీవాలను రవాణా చేస్తే కఠిన చర్యలు: ఎస్పీ

ఆసిఫాబాద్, జూన్ 7: అనుమతి లేకుండా పశువుల రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ సురేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా అనుమతులు లేకుండా పశువులను రవాణా చేస్తే పోలీసులకు లేదా కంట్రోల్‌రూంకు సమాచారం అందించాలన్నారు. స్వయంగా వెళ్లి అడ్డుకొని గొడవలు సృష్టించినట్లయితే వారిపై కూడా క్రిమినల్ కేసులు నమోదుచేసి చర్యలు తీసుకుంటామన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా పశువులను రవాణాచేసే అవకాశం ఉన్నందున పోలీ సులు, పశుసంవర్థక శాఖ సమన్వయంతో ఆరు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. బక్రీద్ పండుగను శాంతియుతంగా ప్రశాంతవాతావరణంలో నిర్వహించడానికి జిల్లా పోలీసుయంత్రాంగం గట్టిప్రణాళికతో కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందించాలి



మాట్లాడుతున్న ప్రాజెక్టు అధికారి ఇందిర

జైనూర్, జూన్ 7: మండలంలోని మా రుమూల గ్రామాల్లో కొనసాగుతున్న అం గన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భి ణులు, బాలింతలకు సరైన పౌష్టిక ఆహారం అందిం చాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఇందిర అన్నారు. మండల కేంద్రంలోని కాసుపటేల్‌గూడలో శుక్రవారం అంగన్‌వాడీ టీచర్లతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు రోజు కుటుంబసర్వేలు నిర్వహించి తుదినివేదికను ఐసీడీఎస్ కార్యాలయంలో అందిం చాలని సూచించారు. అదేవిధంగా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా కేంద్రాలు పనిచేసేలాచర్యలు తీసుకోవాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. ప్రతిరోజు చిన్నారుల బరువు, ఎత్తులను కొలుస్తుండాలని కోరారు. ఈసందర్భంగా జైనూర్ ఐసీడీఎస్ సూపర్ వైజర్ పింటుబాయి, లింగాపూర్ సూపర్‌వైజర్ లైల, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాగజ్‌నగర్, జూన్ 7: కాగజ్‌నగర్ 33/11కేవీ మరమ్మతుల దృష్ట్యా శనివారం పట్టణానికి విద్యుత్‌సరఫరాలో ఉదయం 9.00నుంచి మధ్యాహ్నం 1.00గంటల వరకు అంతరాయం ఉంటుందని ఏఈ కమలాకర్ తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

కౌటాల/బెజ్జూరు: బెజ్జూరు, కౌటాల మండలాల్లో శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటలవరకు విద్యుత్‌సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏడీఈ రాజేశ్వర్ తెలిపారు. సిర్పూర్(టి) మండలం లక్ష్మీపూర్ నుంచిలోనవెల్లి సబ్‌స్టేషన్‌వరకు 33కేవీ లైన్‌మరమ్మతుల కారణంగా విద్యుత్‌సరఫరాలో అంతరాయం కలుగుతుందని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అగ్నివీర్‌కు ఎంపికైన యువకులకు సన్మానం



యువకులను సన్మానిస్తున్న ఎస్సై రమేష్

సిర్పూర్(టి), జూన్ 7: మండలానికి చెందిన యువకులు పాలక్‌రావు, దశరత్, ధర్మ ఆర్మీ అగ్నివీర్‌కు ఎంపికైనందున ఎస్సై దీకొండ రమేష్ వారిని అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్సై రాములు ఉన్నారు.

గ్రూప్-1 పరీక్షకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, జూన్ 7: ఈనెల9న నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమినరీపరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌లు దీపక్‌తివారి, దాసరివేణు, ఏఎస్పీ ప్రభాకర్‌రావు, ఆర్డీవోలు లోకేశ్వర్‌రావు, సురేష్, జిల్లాప్రాంతీయ సమన్వయకర్త లక్ష్మీనర్సింహం, డీఎస్పీ సదయ్యతో కలిసి గ్రూప్-1ప్రిలిమనరీ పరీక్షనిర్వహణలో విధులు నిర్వహించే డిపార్టుమెంట్ అధికారులు, రూట్ అధికారులు, ఐడెంటిఫికేషన్ అధికారులు, పోలీసు అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు 13కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆసిఫాబాద్‌లో 6కేంద్రాలు 1271మంది అభ్యర్థులు, కాగజ్‌నగర్‌లో 7కేంద్రాలు1512మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతారన్నారు. ఉదయం 9గంటలకే అభ్యర్థులు పరీక్షాకేంద్రాలకు చేరుకోవాలన్నారు. 10గంటల తరువాత పరీక్షాకేంద్రంలోకి అనుమతి లేదన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్‌లు ఎట్టి పరిస్థితుల్లో అనుమతించేది లేదన్నారు. పరీక్షాకేంద్రాల వద్ద 144సెక్షన్ అమలుతోపాటు మూడు కిలోమీటర్ల పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే పరీక్ష సమయంలో జిరాక్స్ సెంటర్లు మూసివేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్లు, జిల్లా అధికారులు, ఐడెంటిఫికేషన్, పోలీసుసబంధితశాఖల అధికా రులు పాల్గొన్నారు.

ఐదు రోజులుగా రోడ్డుపైనే చెట్టు



రోడ్డుపై అడ్డంగా పడి ఉన్న చెట్టు

పెంచికలపేట, జూన్ 7: ఇటీవల కురిసిన వర్షాలకు ఎల్లూరు- ఆగర్‌గూడ గ్రామాల మధ్య రోడ్డుకు అడ్డంగా ఓచెట్టు విరిగిపడి పోయింది. అయిదు రోజులు గడుస్తున్నా ఇప్పటికీ ఆచెట్టును తొలగించలేదు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆగర్‌గూడ, కమ్మర్‌గాం, నందిగాం, గుండెపల్లి, మురళీగూడ, జిల్లెడ గ్రామాల ప్రజలు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు అడ్డంగా పడిఉన్న చెట్టును తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

విద్యుత్ సమస్య తలెత్తితే సమాచారం ఇవ్వాలి

ఆసిఫాబాద్, జూన్ 7: రానున్న వర్షాకాలంలో విద్యుత్‌సరఫరాలో ఎలాంటి సమస్య తలెత్తినా వినియోగదారులు సబ్‌స్టేషన్‌లకు సమాచారం అందించాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ వాసుదేవ్ తెలిపారు. రాబోయే వర్షాకాలంలో ఈదురుగాలులకు స్తంభాలు పడిపోయినా, తీగలు తెగిపడినా, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగినా ఆసిఫాబాద్ సబ్‌స్టేషన్ (9491 075633), బూర్గుడ సబ్‌స్టేషన్ (9440229610)కు సమాచారం అందించాలన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 7: ఆసిఫాబాద్ మండలంలోని 14యూపీఎస్, యూఆర్‌ఎస్, 2పీఎస్ ప్రభుత్వపాఠశాలలకు శుక్రవారం పాఠ్యపుస్తకాల పంపిణీని మండలనోడల్ అధికారి ఉదయ్ బాబు అందజేశారు. కార్యక్రమంలో ఎంఐఎస్ సంతోష్‌కుమార్, సీసీవో అనూప్‌కుమార్, సీఆర్పీలు తిరుపతి, స్వప్న, ప్రవళిక, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్‌గా దేవయ్య

కౌటాల, జూన్ 7: కాగజ్‌నగర్ వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్మన్‌గా సిద్దల దేవయ్య(కౌటాల), వైస్ చైర్మన్‌గా వార్ల తిరుపతి(కాగజ్‌నగర్)ను నియమిస్తూ ఏపీసీ, ప్రభుత్వకార్యదర్శి ఎంరఘునాథ్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. చైర్మన్, వైస్‌చైర్మన్లతోపాటు సభ్యులుగా షేక్ అబ్దుల్‌సమీర్, కస్తూరి సత్యనారాయణ, కాసనగొట్టు సంతోష్, రాపెల్లి రామయ్య, చెమ్మకారి తోగయ్య, ఆత్రం రాజారాం, బొబ్బల హరిక, గోమాస తిరుపతి, లెండుగురె శంకర్, ఎలాది మధుసుదన్, మైలారపు మురళీదర్, తూడురు వెంకటరమణను నియమించారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

దహెగాం, జూన్ 7: మండలంలోని ఒడ్డుగూడ గ్రామంలోని భక్తాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం ఆలయ ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్లాంటేషన్ భూములు పరిశీలించిన ఎఫ్ఆర్వో

కాగజ్‌నగర్, జూన్ 7: కాగజ్‌నగర్ కడంబా అటవీ ప్రాంతాన్ని శుక్రవారం ఎఫ్ఆర్వో రమాదేవి, సిబ్బంది పరిశీలించారు. ప్లాంటేషన్ భూముల విషయంలో ఎలాంటి పనులు చేపట్టరాదన్నారు. రెండ్రోజుల క్రితం అక్రమంగా తవ్వకాలు జరిపిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

ఆర్ఎంపీ, పీఎంపీల స్వచ్ఛంద బంద్

కౌటాల, జూన్ 7: మండలంలోని అయిదు రోజుల పాటు స్వచ్ఛందంగా బంద్ పాటిస్తున్నట్లు ఆర్ఎంపీ, పీఎంపీలు పేర్కొన్నారు. కొన్ని రోజులుగా ఆర్ఎంపీ, పీఎంపీలపై అధికారుల దాడులు ఎక్కువయ్యాయని దీనికి నిరసనగా బంద్ పాటిస్తున్నట్లు తెలిపారు.

సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను సన్మానిస్తున్న ఎంపీటీసీలు

తిర్యాణి, జూన్ 7: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో వారు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మండలంలోని నీటి సమస్యతోపాటు అంతర్గతరోడ్ల సమస్యలు ప్రధానంగా ఉన్నాయని తెలిపారు. అటవీ శాఖఅనుమతులు రాక పనులు ఎక్కడికక్కడ నిలిచి పోయా యని అన్నారు. ఈనెల 10న అన్నిశాఖల సమావేశం నిర్వహించి మారుమూల గిరిజన ప్రాంతాల సమస్యలు పరిష్కరించే విదంగా చర్యలు చేపడుతామన్నారు. మరో నెలలో పదవీకాలం పూర్తి చేసుకోబోతున్న మండలపరిషత్ పాలకవర్గానికి అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను సభ్యులు సన్మానిం చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ చంద్రశేఖర్, వైస్‌ఎంపీపీ పార్వతి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్, ఎంపీడీవో మల్లేష్, ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వార్షిక పరీక్షల పారితోషికం వెంటనే చెల్లించాలి



డీఐఈవోకు వినతిపత్రం అందజేస్తున్న లెక్చరర్లు

ఆసిఫాబాద్ రూరల్, జూన్7: ఇంటర్మీడియట్ వార్షికపరీక్షల్లో విధులు నిర్వహించిన సిబ్బందితో పాటు స్పాట్‌వాల్యుయేషన్‌లో పాల్గొన్న సిబ్బందికి చెల్లించే పారితోషికం ఎప్పటికప్పుడు చెల్లించాలని జీజేఎల్ఏ ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు నవీన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంచిర్యాలలో నిర్వహిస్తున్న స్పాట్ వాల్యుయేషన్ కేంద్రం లో ఆసిఫాబాద్‌కమిటీ ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో డీఐఈవో శైలజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష విధులకు సంబంధించిన మొత్తంతో పాటు ఇంటర్మీడియట్ స్పాట్‌వాల్యుయేషన్ మొత్తాన్ని కూడా గతంలో మాదిరిగా చెల్లించాలన్నారు. పారితోషికం మొత్తం పదిశాతం తగ్గించి ఇవ్వడం సరి కాదన్నారు. కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ జూనియర్‌లెక్చరర్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు అమరేందర్, చంద్రయ్య, రాజమౌళి, ప్రభాకర్, తిరుపతి, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సహకారంతో కృత్రిమకాలు ఏర్పాటు

బెజ్జూరు, జూన్ 7: మండలంలోని ముంజంపల్లి గ్రామానికిచెందిన ఆత్రం భుజంగరావు గత సంవత్సరం ప్రమాదశాతు కాలును కోల్పోయాడు. పోలీసులు మీ కోసంలో భాగంగా ఈనెల6న ఎస్సై విక్రం అతనికి జైపూర్ కృత్రిమకాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆత్రం భుజంగరావు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ముంజంపల్లి గ్రామస్థులు రమేష్, రుషి, పోలీసులు విజయ్, మహేష్, శంకర్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ

పెంచికలపేట, జూన్ 7: మండలంలోని చెడ్వాయి, మొట్లగూడ గ్రామాల్లో ఎరువుల దుకాణాలను శుక్ర వారం ఏఈవో గౌసియాబేగం తనిఖీ చేశారు. నాణ్యమైన విత్తనాలను రైతులు అందుబాటులో ఉంచాలని సూచించారు. రిజిస్టర్‌లో స్టాక్ నమోదు చేయాలని, నోటీసు బోర్డులో రోజువారీగా అందుబాటులో ఉన్న విత్తన ధరలు పొందుపర్చాలన్నారు. రైతులకు రశీదులను అందించాలని, నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాలపై చర్యలు తీసుకోవాలి

- మండల సమావేశంలో సభ్యుల డిమాండ్



సమావేశంలో పాల్గొన్న సభ్యులు

వాంకిడి, జూన్ 7: రైతులకు ఎంఆర్‌పీ ధరలకంటే అధికంటే పత్తి విత్తనాలు విక్రయిస్తున్న ఫర్టిలైజర్ దుకాణాలపై చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంపీపీ ముండె విమలాబాయి అధ్యక్షతన వాంకిడి మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ పత్తి విత్తనాల విక్రయాల్లో ఫర్టిలైజర్ యజమానులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఒక్కో పత్తి విత్తనాల పాకెట్‌ను రూ.864 విక్రయించాల్సి ఉండగా రూ.14వందల నుంచి రూ.2000 వరకు విక్రయిస్తున్నారన్నారు. అదేవిధంగా మండలంలోని రైతులకు పత్తి విత్తనాలు విక్రయించకుండా సరిహద్దులోని మహారాష్ట్రకు చెందిన రైతులకు విక్రయించడంవల్ల మండల రైతులకు విత్తనాలు సరిపడ అందడంలేదని ఖమన ఎంపీటీసీ ప్రవీణ్ ఆరోపించారు. మండలంలో విచ్చల విడిగా పత్తి విక్రయాలు జరుగుతున్న వ్యవసాయ అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తుండడం సరైంది కాదన్నారు. మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తున్న యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇతర ప్రాంతాల వారికి విత్తనాలు విక్రయించ కుండా చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేవారు. మండల కేంద్రంలోని కేబి ప్రాజెక్టు కెనాల్ ద్వారా రైతులకు సాగు నీరు అందిచడంలో సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని సభ్యులు ఆందోళనకు దిగారు. ఉన్నతాధికారులు స్పందించి కాలువల ద్వారా రైతులకు సాగు నీరందించేలా చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. ప్రతి మూడు నెలలకోసారి జరిగే మండల సమావేశంలో పూర్తిస్థాయిలో అధికారులు రాకపోవడంతో తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడంలేదని ఖమాన ఎంపీటీసీ ప్రవీణ్ ఆవేదన వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో జడ్పీటీసీ అజయ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ పెంటు, ఎంపీడీవో వీవీ వరలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ శ్రావణ్, ఎంఈవో మనుకుమార్, ఈజీఎస్ ఏపీవో శ్రావణ్, ఐకేపీ ఏపీఎం మహేష్, పీఆర్‌ఏఈ స్టీవెన్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



కార్మికులకు వసతులు కల్పించాలి

శ్రీరాంపూర్, జూన్ 7: గనిపై కార్మికులకు అవసరమైన వసతులు కలల్పించాలని ఏఐటీయూసీ ఏరియాఉపాధ్యక్షుడు జె శంకర్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో ఆర్కేన్యూటెక్ గనిపై బాయిబాట కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ, పెద్దపల్లి ఎంపీగా గడ్డం వంశీకృష్ణను గెలిపించడం సంతోషంగా ఉందన్నారు. గనిపై ఉన్న గదుల్లో వర్షం కురిసినప్పుడు ఉరుస్తోందని, కార్మికులకు గ్లౌసులు ఇవ్వడం లేదని, తాగునీరు అందించడం లేదని, మెటీరియల్ సరఫరా సక్రమంగా లేదని, ఎస్‌డిఎల్ వాహనాలకు విడిభాగాలు అందించడం లేదని ఆరోపించారు. మేనేజర్ స్వామిరాజు దృష్టికి పలుసమస్యలు తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ఆయన పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేనశ్యామ్, ఉపప్రధానకార్యదర్శి గరిగెస్వామి, నాయకులు పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్, జూన్ 7: సీఎంపీఎఫ్ సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, కార్యదర్శి అంబాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రెండేళ్లకుచెందిన సీఎంపీఎఫ్ చిట్టీలు అందించాలని, 2020-21 సంవత్సరానికి చెందిన వడ్డీ రేట్లు సవరించాలని, రిటైర్డ్ కార్మికులకు మూడు నెలలకు సంబంధించి కొత్త పెన్షన్లు ఇవ్వాలని, 11వ వేజ్‌బోర్డు ప్రకారం రివైజ్డ్ పెన్షన్ మంజూరు చేయాలన్నారు. అపరిష్కృత సమస్యల పరిష్కారానికి గనులవారీగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కస్తూరి చంద్రశేఖర్, వెంగళ శ్రీనివాస్, తోడే సుధాకర్, సాయిల్ల శ్రీనివాస్, శ్రీధర్, పెరుక సదానందం, సిరికొండ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.